## క్లుప్తంగా

### వైఎస్సార్‌సీపీ మండల, వార్డు యూత్ అధ్యక్షులు వీరే

**తగరపువలస:** వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో భీమిలి నియోజకవర్గంలోని మండలాలు, వార్డులు, క్లస్టర్ యూత్ అధ్యక్షుల జాబితాను పార్టీ కేంద్ర కార్యాలయం శనివారం విడుదల చేసింది. భీమిలి మండల పార్టీ యూత్ అధ్యక్షుడిగా చిల్ల హరి, పద్మనాభం మండలానికి బుగత సత్యనారాయణ, ఆనందపురం మండలానికి చందక అప్పలస్వామి, జీవీఎంసీ పరిధిలో 1వ వార్డు అధ్యక్షుడిగా అక్కరమాని చినబాబు, 2వ వార్డుకు కొండపు సూరిబాబు, 3వ వార్డుకు ముక్కి కృష్ణ, 4వ వార్డుకు వాండ్రాసి సన్యాసిరావు అధ్యక్షులుగా నియమితులయ్యారు. క్లస్టర్‌ల వారీగా 3వ క్లస్టర్‌కు బగాది లక్ష్మణ్, 4కు పోతిన మూర్తి, 5కు జగుపల్లి నరేష్, 6కు చంటి, 7కు బోర మోహన్‌రెడ్డిలను నియమించారు.

### గడ్డివాములు దగ్ధం



దగ్ధమవుతున్న గడ్డివాములు

**కొమ్మాది:** భీమిలి బీచ్ రోడ్ రామాద్రిలో అగ్ని ప్రమాదం సంభవించింది. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రామాద్రి ఆధ్వర్యంలో గోసేవ నిర్వహిస్తున్నారు. గోవుల కోసం తీసుకుని వచ్చిన నాలుగు గడ్డివాములు శనివారం మధ్యాహ్నం అకస్మాత్తుగా ఒకదాని తరువాత ఒకటి దగ్ధమయ్యాయి. ఏమి జరిగిందో తెలుసుకునేప్పటికి పూర్తిగా కాలి బూడిదైపోయాయి. ఈ ప్రమాదం ఎలా సంభవించిందో తెలియదని, సుమారు రూ.80 వేల ఆస్తినష్టం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

### పేకాటరాయుళ్లకు ఐదు రోజుల జైలుశిక్ష

**పద్మనాభం:** మండలంలోని మద్దిలో చెరకు కాటా సమీపంలో జులై నెలలో పేకాట ఆడుతున్న నలుగురిపై నమోదు చేసిన కేసులో శనివారం భీమునిపట్నం 14వ మెట్రోపాలిటన్ కోర్టు ఐదు నెలలు జైలుశిక్ష విధిస్తూ తీర్పు చెప్పినట్టు సీఐ ఎస్.సన్యాసినాయుడు తెలిపారు. మద్ది గ్రామానికి చెందిన మద్ది సురేష్, జొన్నాడ రాంబాబు, బాడితమాను సాయి, జొన్నాడ సురేష్‌కు జైలుశిక్ష విధించారన్నారు.

**లారీ డ్రైవర్‌కు ఐదు రోజులు..**

మండలంలోని కురపల్లి సమీపంలో జూన్ నెలలో మద్యం తాగి లారీ నడుపుతున్న డ్రైవర్‌పై నమోదు చేసిన కేసులో డ్రైవర్‌కు ఐదు రోజులు జైలుశిక్ష విధించనట్టు సీఐ తెలిపారు. భీమునిపట్నం మండలం తాటితూరు గ్రామానికి చెందిన లారీ డ్రైవర్ మద్దిల గోవిందకు ఈ శిక్ష విధించినట్టు చెప్పారు.

### విద్యుత్ చార్జీలపై నిరసన

**మధురవాడ:** పెరిగిన విద్యుత్ చార్జీలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని బీజేపీ భీమిలి నియోజకవర్గ కన్వీనర్ కంటుభుక్త రామానాయుడు అన్నారు. శనివారం మధురవాడ కరెంట్ ఆఫీసు వద్ద ఆ పార్టీ నాయకులు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగదారుల నుంచి అధిక చార్జీలు వసూలు చేయడం తగదన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కో కన్వీనర్ పసుపులేటి శ్రీనివాస్, రాష్ట్ర యువ మోర్చా నాయకుడు మాధవరావు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ఉప్పాడ అప్పారావు, జిల్లా మత్స్యకార నాయకుడు వాసుపల్లి హరి, తదితరులు పాల్గొన్నారు.

### 28, 29 తేదీల్లో బయోమిచికా 2కే23 సదస్సు

**ఏయూ క్యాంపస్:** ఆంధ్ర విశ్వవిద్యాలయం బయోకెమిస్ట్రీ విభాగంలో ఈ నెల 28, 29 తేదీల్లో బయోమిచికా 2కే23 జాతీయ వర్క్‌షాప్ జరగనుంది. ఈ మేరకు సదస్సు పోస్టర్‌ని ఏయూ ఇన్‌చార్జి వీసీ ఆచార్య కె.సమత తన కార్యాలయంలో శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బయోకెమిస్ట్రీ విభాగాధిపతి ఆచార్య పి.సుభాషిణి దేవి మాట్లాడుతూ ఈ వర్క్‌షాప్‌లో ఇమ్యునాలజీ, జెనిటిక్ ఇంజినీరింగ్, బయోకెమికల్ టెక్నికల్‌లతో శిక్షణ ఇస్తారన్నారు. ఈ కార్యక్రమంలో విభాగ పరిశోధకులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.



# కనువిందు.. ఉత్తర ద్వార దర్శనం

- కనుల పండువగా వైకుంఠ ఏకాదశి
- భక్తులతో ఆలయాలు కిటకిట



సంగివలస కాలనీలో సీతారామలక్ష్మణుల విగ్రహాలతో పల్లకీ సేవ

**తగరపువలస:** వైకుంఠ ఏకాదశి సందర్భంగా శనివారం భీమిలి నియోజకవర్గంలోని వైష్ణవాలయాలలో ఉత్తర ద్వార దర్శనాలకు భక్తులు పోటెత్తారు. నిత్యం దర్శించుకునే ప్రవేశమార్గాలు కాకుండా ఆలయ కమిటీ ప్రతినిధులు ప్రత్యేక ఏర్పాట్ల ద్వారా భక్తులను ఆలయంలోకి ప్రవేశం కల్పించారు. వెంకటేశ్వరమెట్టపై ఆలయ ప్రతినిధి రాజగిరి కుసుమహర ఆధ్వర్యంలో జరిగిన పూజా కార్యక్రమాలకు భక్తులు పోటెత్తారు. కొండ కింద జాతీయ రహదారి వరకు క్యూ లైన్లలో బారులు తీరారాడు. శ్రీరమాసత్యనారాయణ ఆలయాల్లో అర్చకులు ఏడిద వివేకానందశర్మ, కార్తీకశర్మ ఆధ్వర్యంలో సామూహిక సత్యనారాయణ వ్రతాలు చేశారు. సంగివలస కాలనీలో సీతారామలక్ష్మణ, షిర్డీ సాయిబాబా, గణపతి ఆలయంలో సంతపేటకు చెందిన కుసుమహర భజన బృందం హరేనామ సంకీర్తనతో భక్తులను పరవశింపచేశారు. ఇక్కడ జరిగిన పల్లకి ఉత్సవంలో సీతారామలక్ష్మణులను ఆలయ కమిటీ అధ్యక్షుడు అక్కరమాని మంగరాజు, గుడివాడ ఆదినారాయణ, నూలు బంగారు రాజు, కె.చిట్టిబాబు, కిల్లి ఈశ్వరరావు, లక్ష్మి, తవుడుబాబు, దంతులూరి వెంకటలక్ష్మి, భగవాన్, తమ్మిన కుమారి,కొయ్యాన అరుణ, బోనిల మురళి తదితరులు ఊరేగించారు. ప్రధాన రహదారిలోని షిర్డీసాయిబాబా ఆలయం, చిల్లపేట, చిట్టివలస జ్యూట్‌మిల్లు రామాలయాలలో ముక్కోటి ఏకాదశి వేడుకలు జరిగాయి. మండల పరిధిలో లక్ష్మీపురం శ్రీకృష్ణాలయం, తాటితూరు, చిప్పాడ, మూలకుద్దు, అన్నవరం, మజ్జివలస, డొంకరపేట, కృష్ణంరాజుపేట, తాళ్లవలసలోని రామాలయాలలో ప్రత్యేక పూజలు చేశారు.

**కొమ్మాది:** స్థానిక అన్నంరాజునగర్‌లోని శ్రీఅష్టలక్ష్మీ ఆలయంలో తెల్లవారుజామున శ్రీలక్ష్మీనారాయణ స్వామికి తిరుప్పావై సేవా కాలం నిర్వహించి భక్తులకు ఉత్తర ద్వార దర్శనం కల్పించారు. సాగర్‌నగర్‌లోని ఇస్కాన్ టెంపుల్‌లో రాధాకృష్ణులను వేంకటేశ్వరస్వామి, గోదాదేవిగా అలంకరించారు. అనంతరం భక్తులకు ఉత్తర ద్వార దర్శనం కల్పించినట్లు ఇస్కాన్ అధ్యక్షుడు సాంబాదాస్ ప్రభూజీ తెలిపారు. భీమిలి బీచ్ రోడ్డు రామాద్రి హంసవన పుణ్యక్షేత్రంలో ప్రధాన అర్చకుడు కొత్తలంక సూర్యనారాయణ మూర్తి ఆధ్వర్యంలో గోపూజ, సామూహిక సత్యనారాయణమూర్తి వ్రతాలు చేశారు.

**ఘనంగా అనంతుడి ఊరేగింపు**

**పద్మనాభం:** పద్మనాభంలోని కుంతీ మాధవ స్వామి ఆలయంలో వైకుంఠ ఏకాదశి వేడుకలు ఘనంగా జరిగాయి. ఉదయం 4 గంటలకు స్వామికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి సమేత అనంతుడి ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. అనంతరం భక్తులకు ఉత్తర ద్వార దర్శనం కల్పించారు. ఆలయంలోని ఉత్సవ విగ్రహాలు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చాయి. పద్మనాభం సర్పంచ్ తాలాడ పాప, వైఎస్సార్‌సీపీ నాయకుడు తాలాడ పద్మనాభం, కృష్ణాపురం సర్పంచ్ కంటుబోతు లక్ష్మి, కృష్ణాపురం, రెడ్డిపల్లి, మద్ది, విలాస్కాన్‌పాలెం గ్రామాల నుంచి తరలివచ్చిన భక్తులు ఉత్తర ద్వార దర్శనం చేసుకున్నారు.



వెంకటేశ్వరమెట్టపై తులసిమాలల అలంకరణతో శ్రీదేవి, భూదేవి సహిత వేంకటేశ్వరస్వామి

**మధురవాడ:** నగరంపాలెం రోడ్డులోని శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో అధ్యక్ష, కార్యదర్శులు కె.ఎస్.చలపతిరావు, వై.నారాయణరావు, కార్యవర్గ సభ్యులు బి.అప్పలనాయుడు, నారాయణ ఆధ్వర్యంలో ప్రధాన అర్చకుడు మావుడోరి మోహనశర్మ పూజలు నిర్వహించారు. ఐటీ సెజ్ జంక్షన్‌లోని శ్రీలలితా త్రిపుర సుందరీ సమేత మహా కామేశ్వరస్వామి ఆలయం ప్రాంగణంలోని భద్రాది రాముని ఆలయంలో వ్యవస్థాపక అధ్యక్షుడు బొడ్డేపల్లి సురేష్, కార్యదర్శి అప్పారావు తదితరులు ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. మధురవాడ జంక్షన్ సిద్ధేశ్వరస్వామి పీఠంలోని అష్టలక్ష్మి ఆలయంలో ధర్మకర్త నరసింహమూర్తి ఆధ్వర్యంలో విశేష పూజలు చేశారు. ఆయా ఆలయాల్లో భక్తులకు ఉత్తర ద్వార దర్శనాలు కల్పించారు.



శ్రీనివాసనగర్ ఆలయంలో స్వామికి పూజలు చేస్తున్న అర్చకులు

**భీమునిపట్నం:** భీమిలి సౌమ్యగిరిపై ఉన్న పురాతన లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో ముక్కోటి ఏకాదశి పూజలు వైభవంగా జరిగాయి. ప్రధానార్చకుడు ఆర్.సింగరాచార్యులు ఆధ్వర్యంలో స్వామికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు ఉత్తర ద్వార దర్శనం చేసుకుని తరించారు. కీతిన్‌పేట వద్దనున్న ఐశ్వర్య వేంకటేశ్వర స్వామి ఆలయంలో కూడా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ట్రస్టీలు కలిగొట్ల శ్రీరామచంద్ర మూర్తి, కలిగొట్ల సూర్యనారాయణమూర్తి, కె.భానోజిరావు, కె.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

**పీఎం పాలెం:** బక్కన్నపాలెం రోడ్డులోని వేంకటేశ్వర స్వామి ఆలయం శనివారం భక్తులతో కిటకిటలాడింది. ముక్కోటి ఏకాదశి పర్వదినం సందర్భంగా భక్తుల గోవింద నామ స్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. సుమారు 4 వేల మంది భక్తులు స్వామిని దర్శించుకున్నారు. క్రికెట్ స్టేడియంకు సమీపంలో ఉన్న వెంకటేశ్వరస్వామి, పీఎం పాలెం మూడో బస్టాపునకు సమీపంలోని రామాలయంలో ముక్కోటి ఏకాదశి పూజలు చేశారు.



వెంకటేశ్వరుని అలంకరణలో శ్రీ కృష్ణుడు



పూల అలంకరణలో శ్రీ లక్ష్మీ నారాయణ స్వామి



బక్కన్నపాలెం వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఉత్తర ద్వారంలో దర్శనమిచ్చిన శ్రీవారు



శ్రీరమా సత్యనారాయణస్వామి ఆలయంలో సామూహిక సత్యనారాయణ వ్రతాలు



రామాద్రిలో గోపూజ నిర్వహిస్తున్న భక్తులు



శ్రీదేవి, భూదేవి సమేత అనంతుడి ఉత్సవ విగ్రహాలను ఊరేగిస్తున్న నాయకులు, భక్తులు





భీమిలి ఆలయం వద్ద బారులు తీరిన భక్తులు, స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

## ‘ఆడుదాం ఆంధ్రా’ పోటీలకు పక్కా ఏర్పాట్లు

**మధురవాడ:** ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీలను పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని రకాల ఏర్పాట్లు చేయాలని జీవీఎంసీ జోన్–2 కమిషనర్ కనకమహాలక్ష్మి, విశాఖ రూరల్ మండల విద్యా శాఖ అధికారి అనురాధ ఆయా శాఖల అధికారులు, సిబ్బందికి సూచించారు. జోనల్ కార్యాలయంలో శనివారం సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇప్పటికే సచివాలయాల పరిధిలో వివిధ రకాల కిట్లు అందజేశామన్నారు. ఈ నెల 26 నుంచి చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, నవోదయ తదితర చోట్ల పోటీలు ప్రారంభమవుతాయని చెప్పారు. జనవరి 9వ వరకు వార్డు సచివాలయం పరిధిలో, జనవరి 10 నుంచి 23 వరకు మండల స్థాయిలో పోటీలు జరుగుతాయన్నారు. పోటీలు నిర్వహించే ప్రదేశాల్లో తాగునీరు, అన్ని రకాల కిట్లు సిద్ధం చేయాలని సూచించారు. సమాశంలో విశాఖ రూరల్ మండలం పరిధిలోని వివిధ పాఠశాలల పీడీలు, పీఈటీలు, సచివాలయాల ఎడ్మిన్‌లు, డీఎస్ఏ కోచ్ చైతన్య తదితరులు పాల్గొన్నారు.



పోటీల నిర్వహణపై చర్చిస్తున్న జీవీఎంసీ, విద్యా శాఖ అధికారులు

## మహిళలకు కుట్టు మిషన్ల పంపిణీ

**భీమునిపట్నం:** భీమిలి తోటవీధి కల్యాణ మండపం వద్ద మహిళలకు కుట్టు మిషన్ల పంపిణీ కార్యక్రమం జరిగింది. విశాఖకు చెందిన వాసవ్య మహిళా మండలి ఆధ్వర్యంలో తొమ్మిది రోజులుగా ఇక్కడ 25 మంది పేద మహిళలకు ఉషా సిలై, స్మాల్ ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సహకారంతో నిర్వహించిన శిక్షణ కార్యక్రమం శనివారంతో ముగిసింది. ఈ సందర్భంగా శిక్షణ పొందిన వారికి ముఖ్య అతిథి తహసీల్దార్ రమేష్ కుట్టు మిషన్లు అందించారు. ఆయన మాట్లాడుతూ పేద మహిళలు స్వయం ఉపాధి పొందడానికి టైలరింగ్‌లో శిక్షణ ఇచ్చి, కుట్టుమిషన్లు అందివ్వడం మంచి విషయమన్నారు. ఇటువంటి కార్యక్రమాల ద్వారా మరింత మందికి సహకారం అందించాలని, వారి జీవితాలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో వాసవ్య మహిళా మండలి ప్రతినిధులు మాధవి గణపతి, పార్వతి, వరలక్ష్మి, హేమలత, ఉషా సిలై కో ఆర్డినేటర్ కోన శివయ్య, టైలరింగ్ బోధకురాలు గౌసియా బేగం పాల్గొన్నారు.



మహిళకు కుట్టు మిషన్ అందిస్తున్న తాహసీల్దార్ రమేష్

## ‘అవి వదిలేసినప్పుడే భగవత్ సాక్షాత్కారం’

**తగరపువలస:** నేను అనే స్ఫురణకు ఆధారమైనదే ఆత్మ అని, జడమైన శరీరానికి నావి, నేను అనే భావజాలాన్ని వదిలేసినప్పుడే భగవత్ సాక్షాత్కారం అవుతుందని సంస్కృత పండితుడు, కొమ్మాది బృందావన భక్త ప్రచార వేదికకు చెందిన విశ్వనాథ రాజేశ్వరరావు అన్నారు. గీతాజయంతి మహోత్సవాల్లో భాగంగా శనివారం స్థానిక గీతా ప్రచార సంఘం ఏర్పాటు చేసిన ప్రవచన కార్యక్రమంలో భాగంగా ఆయన అర్జున విషాదయోగంలోని కలవరం గురించి వివరించారు. ఆత్మసాధానికి పునాది భగవద్గీతని అన్నారు. భగవత్ దర్శనంలో జీవితంలో ఒక్కసారైనా అనుభూతి కలగాలన్నారు. భగవంతుడి గురించి శ్రవణం అత్యంత ప్రధానమైనదని పేర్కొన్నారు. ధృతరాష్ట్రుడికి భవిష్యత్తు అంతా తెలుసన్నారు. పాండవుల పక్షాన అర్జునుడు, కృష్ణుడు ఉన్నందున.. విజయం వారినే వరిస్తుందని ముందే సంజయుని ద్వారా కళ్లకు కట్టినట్టు వివరించాడన్నారు. యుద్ధం జరగకపోతే బాగుండునని ధృతరాష్ట్రుడు భావించాడన్నారు. కార్యక్రమంలో చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు పాల్గొన్నారు. వారికి గీతాప్రచార సంఘం నిర్వాహకులు ప్రసాద వితరణ చేశారు.




ప్రవచిస్తున్న విశ్వనాథ రాజేశ్వరరావు

## వివాహిత అనుమానాస్పద మృతి



అనుప కుమారి మృతదేహం

**ఆనందపురం:** మండలంలోని వేములవలసలో శనివారం రాత్రి ఓ వివాహిత అనుమానాస్పదంగా మృతి చెందింది. వివరాలిలా.. జార్ఖండ్ రాష్ట్రం గిరిడ్ జిల్లాకు చెందిన సనోజ్ కుమార్ మూడేళ్ల కిందట ఆనందపురం జంక్షన్‌కు వలస వచ్చి హోటల్‌లో పనిచేస్తున్నాడు. మూడు నెలల క్రితం తాను ప్రేమించిన అనుప కుమారి అనే మహిళను తీసుకొచ్చి వేములవలస జంక్షన్‌లో కాపురం పెట్టాడు. తాను హోటల్ పని చూసుకుని ఇంటికి వెళ్లే సరికి తన భార్య అనుప కుమారి(24) ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిందని సనోజ్ పోలీసులకు సమాచారం అందించాడు. ఈ మేరకు సీఐ రామచంద్రరావు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఈ ఘటనపై సనోజ్ కుమార్‌ను విచారిస్తున్నారు. అనుమానాస్పద మృతిగా పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## క్రీస్తు మార్గం అనుసరణీయం



క్రీస్తు బోధనలు వినిపిస్తున్న ఏసుపాదం

**పీఎం పాలెం:** జీవీఎంసీ 6వ వార్డు పీఎం పాలెంలోని బేతని చర్చ్ ఆవరణలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బేతని సంస్థల వ్యవస్థాపక అధ్యక్షుడు ఏసుపాదం మాట్లాడుతూ ప్రపంచ మానవాళికి ఏసుక్రీస్తు చూపిన శాంతి మార్గం, బోధనలు అనుసరణీయమన్నారు. కరుణ, దయ, జాలి, ప్రేమతో ప్రతి ఒక్కరూ మెలగాలన్నదే దైవ సందేశంగా పేర్కొన్నారు. ప్రపంచ మానవాళి కోసం ఆయన ప్రార్థించారు. బేతని సంస్థల విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అనంతరం కేక్ కట్‌చేసి మహిళలకు చీరలు, మినిస్ట్రీ విద్యార్థులకు దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు గాదె రోశిరెడ్డి, దాసరి శ్రీను, ప్రమోద్ చక్రవర్తి, ఐసాక్, వెంకటలక్ష్మి, రాములు, డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

## పెళ్లయిన రెండేళ్లకే అనంత లోకాలకు..

- రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం
- శోకసంద్రంలో కుటుంబ సభ్యులు





సంఘటనా స్థలంలో అప్పలరాజు మృతదేహం (ఇన్‌సెట్) అప్పలరాజు(ఫైల్)

**పద్మనాభం:** వివాహమైన రెండేళ్లకే మృత్యువు ఓ యువకుడిని రోడ్డు ప్రమాదం రూపంలో కబళించుకు పోయింది. దీంతో ఆ ఇంటిలో విషాద చాయలు అలముకున్నాయి. పద్మనాభం ఏఎస్ఐ ఎస్.శ్రీనివాసరావు తెలిపిన వివరాలిలా.. ఆనందపురం మండలం లొడగలవాని పాలేనికి చెందిన పిన్నింటి అప్పలరాజు(31) తన తోటి స్నేహితుడు లొడగల సురేష్‌తో కలిసి బైక్‌పై శుక్రవారం భీమునిపట్నం మండలం తాటితూరులో భూమి రీసర్వే చేయించుకోవడానికి వెళ్లాడు. తిరిగి ఇంటికి వెళ్లిపోతుండగా శుక్రవారం రాత్రి మార్గం మధ్యలో పాండ్రంగి విద్యుత్ సబ్ స్టేషన్ సమీపంలో రోడ్డు మీద రాంగ్ పార్కింగ్ చేసి ఉన్న ట్రాక్టర్‌ను ఢీకొట్టారు. ఈ సంఘటనలో అప్పలరాజు తలపై బలమైన గాయాలవ్వడంతో అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. సురేష్‌కు తల మీద తీవ్ర గాయాలయ్యాయి. అతడిని సంగివలస ఎన్ఆర్ఐ ఆస్పత్రిలో చికిత్స కోసం చేర్పించారు. మృతుడి భార్య పావని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఏఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు. పెళ్లయిన రెండేళ్లకే అప్పలరాజు మృత్యువు ఒడిలోకి వెళ్లపోవడంతో అతడి కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరవుతున్నారు.

## 10 వేల భగవద్గీత పుస్తకాల పంపిణీకి శ్రీకారం

**మధురవాడ:** గీతా జయంతి, మహా విష్ణువుకి అత్యంత ప్రీతికరమైన వైకుంఠ ఏకాదశి సందర్భంగా మధురవాడ శ్రీవేంకటేశ్వర విద్యాపీఠల్ వ్యవస్థాపకుడు యేటూరి వెంకటేశ్వర్లు శనివారం గీతా ప్రచారానికి శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా 10 వేలు కాపీల భగవద్గీత, 20 వేలు శ్లోకాలు కరపత్రాలు ఆవిష్కరించి పంపిణీని గ్రామ పెద్దల సమక్షంలో ఆయనతో పాటు వైస్ చైర్మన్ వినయ్ వినయ్ వికాస్, డైరెక్టర్లు సంధ్య, ప్రణీత మధురవాడలో ప్రారంభించారు. ఈ సందర్భంగా పెద్దలు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులకు పుస్తకాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయం సెట్ ఏర్పాటు చేసి వేంకటేశ్వరుడు, శ్రీమన్నారాయణుడి చిత్రపటాలు ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. 100 మందికి పైగా విద్యార్థులు సామూహిక భగవద్గీత స్లోకాలు పారాయణం చేశారు.



భగవద్గీత పుస్తకాలతో గ్రామ పెద్దలు, చిన్నారులు

## మహిళా కేంద్రం డైరెక్టర్‌గా ఆచార్య పల్లవి

**ఏయూ క్యాంపస్:** ఆంధ్ర విశ్వవిద్యాలయం దుర్గాబాయి దేశముఖ్ మహిళా అధ్యయన కేంద్రం సంచాలకురాలిగా ఏయూ క్రీడా విభాగాధిపతి ఆచార్య ఎ.పల్లవి నియమితులయ్యారు. ఈ మేరకు ఇన్‌చార్జి వీసీ ఆచార్య కె.సమత, రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్‌స్టీఫెన్‌ల నుంచి ఆమె శనివారం నియామక ఉత్తర్వులు అందుకున్నారు. అనంతరం డాక్టర్ పి.ఉష నుంచి ఆచార్య పల్లవి బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆచార్య పల్లవిని ఆర్ట్స్, కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య నరసింహారావు, పలువురు ఆచార్యులు, తదిరతులు అభినందించారు.



వీసీ కె.సమత నుంచి ఉత్తర్వులు స్వీకరిస్తున్న ఆచార్య కె.సమత

## విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులు

**తగరపువలస:** ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలోని వైఎస్సార్‌సీపీతోనే విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులు సాధ్యమయ్యాయని భీమిలి ఎంపీపీ దంతులూరి వాసురాజు అన్నారు. భీమిలి మండలం దాకమర్రి జెడ్పీ హైస్కూల్‌లో శనివారం 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవితంలో సముచిత స్థానానికి చేరుకోవాలంటే చదువు ఒక్కటే మార్గమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ నాలుగేళ్లలో ప్రాథమిక విద్యకు రూ.50 వేల కోట్లకు పైగా ఖర్చు చేసిందని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ చెల్లూరి పైడప్పుడు, ఎంపీటీసీ సభ్యుడు చెల్లూరి నగేష్‌బాబు, పంచాయతీ కార్యదర్శి రఘునాథబాబు, పార్టీ మండల అధ్యక్షుడు గాడు శ్రీను, స్కూల్ కమిటీ చైర్మన్ బి.అప్పన్న, ప్రధానోపాధ్యాయుడు కె.సన్యాసినాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకుడు పొట్నూరు చంద్రశేఖర్, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



లక్ష్మీవానిపాలెం హైస్కూల్‌లో విద్యార్థులకు ట్యాబ్‌లు అందజేస్తున్న గాదె రోశిరెడ్డి



దాకమర్రి జెడ్పీ హైస్కూల్ విద్యార్థులకు ట్యాబ్‌లు అందిస్తున్న ఎంపీపీ వాసురాజు తదితరులు

**విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ**

**పీఎం పాలెం:** విద్యార్థుల భవిష్యత్‌కు బంగారు బాటలు వేయడానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిరంతరం తపిస్తున్నారని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు గాదె రోశిరెడ్డి అన్నారు. శనివారం పీఎం పాలెం లక్ష్మీవానిపాలెం ఉన్నత పాఠశాలలో 40 మంది 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు అందజేశారు. ముఖ్యమంత్రి ఆశయాలకు అనుగుణంగా విద్యార్థులు చదువులో ఉన్నతంగా రాణించాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.